
www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 02 | నవంబర్ | 2025
పేజీలు : 6

## ఏడుగురు ఉద్యోగుల తొలగింపు

మరొకరి ఇంచార్జ్ బాధ్యతలు రద్దు




# విపత్తులతో విలవిల..బీమా లేకపోతే ఎలా..?

-ప్రతి యేటా ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న రైతాంగం
-అంచనాలు వేయడం తప్పా ఆదుకోని ప్రభుత్వం
-అదానీకి సొమ్ము చేసి వదిలేసిన కేంద్రం


(ఫైల్)

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రతి యేటా ప్రకృతి విపత్తుతో రైతాంగం నష్టపోతూనే ఉన్నారు. ఏదో ఒక పంటను ప్రకృతి ఏదో ఒక రూపంలో దెబ్బతీస్తూనే ఉంది. అతివృష్టి లేదంటే అనావృష్టి కారణంగా రైతులు నష్టపోతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు పంటల బీమా ఉంటే రైతులకు న్యాయం జరుగుతుంది. గతంలో జిల్లా యూనిట్‌గా బీమా కొంత కాలం అమలు చేశారు. జిల్లా మొత్తం ఒకే రీతి వాతావరణ పరిస్థితులు ఉండకపోవడం, విపత్తులు జిల్లా మొత్తం లేకపోవడంతో అప్పట్లో బీమా ఉన్న ఉపయోగం లేకుండా పోయింది. ఆ తర్వాత మండల యూనిట్‌గా బీమాను అమలు చేసే పద్దతిని తీసుకు వచ్చారు. ఇప్పుడు మొత్తంగా గత ప్రభుత్వం నుంచి మిగతా 2లో..


(ఫైల్)

# వీడని హత్య మిస్టరీ

## కొనసాగుతున్న పోలీస్ దర్యాప్తు


(ఫైల్)

**ప్రజాపక్షం/ ఖమ్మం :** చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావు హత్య కేసులో మిస్టరీ వీడలేదు. సంచలనం సృష్టించిన ఈ హత్య కేసుకు సంబంధించి చర్చోపచర్చలు సాగుతున్నాయి. మొత్తంగా ఎవరు చేశారనేది పక్కన పెడితే దీనిని రాజకీయ హత్యగానే భావిస్తున్నారు. సిపిఎం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే హత్య చేశారని ఆరోపిస్తుండగా కాంగ్రెస్ మాత్రం తమకు హత్యలో సంబంధం లేదని ప్రకటిస్తుంది. స్థానికులు హత్యలో పాల్గొన్నారా లేక సుఫారీ ఇచ్చి రామారావును హత్య చేయించారా అనే దానిపై కూడా రకరకాల వాదనలు వినపడుతున్నాయి. రామారావు ఇంటిపైన ఒక చెప్పుల జత ఉండటాన్ని కనుగొన్న తర్వాత ఒక్కరే ఈ హత్యలో పాల్గొన్నారని భావించారు. కానీ రామారావు శరీరంపై గల ఏడు కత్తి పోట్లను పరిశీలించిన తర్వాత మూడు రకాల పదునైన ఆయుధాలతో దాడి చేసినట్లు కనపడుతుంది. ఒక వ్యక్తి మూడు రకాల ఆయుధాలతో దాడి చేయడం సాధ్యం కాదు కాబట్టి రామారావు హత్యలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పాల్గొన్నట్లు తెలుస్తుంది. స్థానికులా లేక సుఫారీ గ్యాంగులా అనే విషయం తేలాల్సి ఉంది.ఇందు కొరకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. క్లూస్‌టీం, ఫోరెన్సిక్ టీంలు దర్యాప్తును మిగతా 2లో..



# విపత్తులతో విలవిల..బీమా లేకపోతే ఎలా..?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి దాకా ప్రభుత్వ పరంగా పంటల బీమా అమలు చేయడం లేదు. బ్యాంకులు పంట రుణాలు ఇచ్చేటప్పుడు బీమా క్రింద కొంత డబ్బు మినహాయించుకుంటున్నప్పటికీ అది కూడా రైతులకు ఉపయోగపడడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టిన కొన్ని కార్పొరేట్ శక్తులకు కోట్ల రూపాయలు మిగిల్చింది తప్ప రైతులకు మాత్రం ఎటువంటి ప్రయోజనం లేదు. పంటల బీమా క్రింద రైతులకు సంబంధించి ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తే రైతులకు విపత్తులు సంభవించినప్పుడు మేలు జరుగుతుంది. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రంలో అతివృష్టి కారణంగా మునుపెన్నడు లేని రీతిలో రైతాంగం భారీగా నష్టపోయింది. పంటల బీమా అమలులో ఉండి ఉంటే రైతులకు ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రభుత్వాలు రైతాంగం సాగు చేసిన పంటలను నోటిఫై చేసిన తర్వాత ఎటువంటి విపత్తులు సంభించిన రైతుకు నగదు రూపంలో పరిహారం దక్కుతుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేవి. ఆ తర్వాత మోడీ పాలనలో 2016లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అనే పథకాన్ని తీసుకువచ్చారు. ఇందులో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించడంతో పాటు మోడీ తన ప్రధాన అనుచరుడిగా చెప్పుకుంటున్న వ్యక్తికి ఈ బీమ పథకాన్ని కట్టబెట్టారు. రెండేళ్ల పాటు వేల కోట్ల రూపాయలు వసూళ్లయిన తర్వాత దాదాపు ఆ సంస్థ పంటల బీమా నుంచి వైదొలిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కానీ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కానీ పంటల బీమా పథకం ఏది అమలు కావడం లేదు. రైతులే ప్రీమియం చెల్లించే విధంగా బీమా పథకాన్ని అమలు చేసిన కొంత ఊరటనిస్తుందని రైతులు కోరుతున్నా పాలకులు స్పందించే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని నీరుగార్చిందని తాము అధికారంలోకి రాగానే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చినప్పటికీ అది నెరవేరలేదు. అంతేకాకుండా రైతు బీమా యోజన పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకం క్రింద రైతు మరణిస్తే మరణించిన 15 రోజుల లోపు ఐదు లక్షల రూపాయలు ఆ కుటుంబానికి వచ్చేవి. ఇప్పుడు రైతు బీమా యోజన పథకం లేకపోవడంతో రైతులు మరణిస్తే ఆ కుటుంబాలు వీధినపడే పరిస్థితి వచ్చింది. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తిస్తే రైతాంగానికి మేలు జరిగే అవకాశం ఉంది. కానీ పాలకులు ఆ వైపుగా స్పందించడం లేదు. రైతే దేశానికి వెన్నుముఖ అని ప్రతి ఒక్కరూ అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు నినాదాలు ఇవ్వడమే తప్ప వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది లేదు. గడిచిన దశాబ్ద కాలంలో ఏదో ఒక విపత్తుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గడిచిన రెండేళ్లలోనే ఒక ఖమ్మం జిల్లాలోనే రూ. 400 కోట్లకు పైబడి రైతాంగం పంటలు నష్టపోయారని ఒక అంచనా. ఇందులో రైతులకు పరిహార రూపంలో తిరిగి వచ్చింది లేదు. పంటల బీమా అమలులో ఉంటే రైతులకు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వైపరీత్యాల బారీనపడి పంటలు నష్టపోయినప్పుడు ఇబ్బందులు లేకుండా ఉండేది. ఇక ప్రభుత్వం పరిహారం ఒక రకంగా పరిహాసమవుతుంది. నష్టాలను అంచనాలు వేసేటప్పుడు ఉన్న నియమ నిబంధనలు రైతులకు శాపంగా మారుతున్నాయి. 60 శాతం పత్తి కాయలు నల్లబడాలి, 60 శాతం పంట పనికిరాకుండా పోవాలి ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుకు మేలు జరిగే పరిస్థితి లేదు. దీనికి తోడు ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి అంచనాలు వేయడం వరకే పరిమితమవుతున్నారు తప్ప పరిహారం అందించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఈ ఏడాది ప్రకృతి విపత్తుల కారణంగా అన్ని పంటలకు నష్టం వాటిల్లింది. గతంలో ఒక పంట పోతే మరో పంట పండుతుందిలే అన్న ఆశ రైతుల్లో ఉండేది. ఈ ఏడాది అటు మెట్ట పంటలు దెబ్బతినగా మొంథా తుఫాన్‌కు వరి పంట కూడా తీవ్రంగా దెబ్బతిన్నది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుస విపత్తులను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా వివిధ కారణాలతో యువ రైతులే మరణిస్తుండడంతో ఆ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. రైతు బీమా యోజనను కూడా అమలు చేయాలని కోరుతున్నారు.

## ఆరున సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల ఆరున ఉదయం 10 గంటలకు ఖమ్మం సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానాలు హాజరవుతారని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ప్రస్తుత రాజకీయ అంశాలు తదితర విషయాలపై కార్యవర్గంలో చర్చించనున్నట్లు సురేష్ తెలిపారు.

# వీడని హత్య మిస్టరీ

(మొదటిపేజీ తరువాయి)

వేగవంతం చేశాయి. ఖమ్మం సిపి సునీల్ దత్ గ్రామాన్ని సందర్శించడమే కాకుండా హత్య మిస్టరీని చేధించేందుకు అన్ని కోణాలను స్వయంగా పరిశీలిస్తున్నారు. రామారావుకు పాతర్లపాడు గ్రామంపై తిరుగులేని పట్టుంది. ఈ ప్రాంతంలో సిపిఎంను బలమైన రాజకీయ పార్టీగా నిలబెట్టడంలో రామారావు కృషి చేశారు. సర్పంచ్‌గా రెండు సార్లు పనిచేయగా ఆయన సతీమణి ఒకసారి సర్పంచ్‌గా పనిచేశారు. అటువంటి బలమైన రాజకీయ నాయకున్ని హత్య చేయడం ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. సిపిఎం ఆరోపిస్తున్నట్లు గ్రామంలో పట్టుకోసమే రామారావును హత్య చేశారా లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అన్నది కూడా తేలియాల్సి ఉంది. ఇటీవల గ్రామానికి చెందిన ఒక కుటుంబ పంచాయతీలో రెండు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తుంది. మొత్తంగా రామారావు హత్యకు సంబంధించి దోషులను పట్టుకుంటే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఉల్లాసంగా స్మార్ట్‌కిడ్జ్ వన సమారాధన






ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు శనివారం అత్యంత ఉల్లాసంగా కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఖమ్మం సమీపంలోని చెరుకూరి వారి మామిడి తోటలో వన సమారాధన కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో ఉల్లాసాన్ని నింపింది. నృత్యాలతో వన ప్రాంగణం హోరెత్తగా చిన్నారులు నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రోజంతా వనంలోనే గడిపారు. మ్యాజిక్ కళాకారులు నిర్వహించిన ప్రదర్శన విద్యార్థులను అబ్బురపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ వనాలు మనం జీవించడానికి ప్రాణవాయువును అందిస్తున్నాయని అందుకే పూర్వీకులు చెట్లను దేవతలుగా భావించి పూజలు నిర్వహించేవారన్నారు. వన సమారాధన స్నేహబంధాన్ని పెంపొందిస్తుందని, ఆచార వ్యవహారాలను కాపాడుతుందన్నారు. పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, సిబ్బంది వన సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏడుగురు ఉద్యోగుల తొలగింపు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏడుగురు ఉద్యోగులకు ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగిస్తూ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని మోడల్ స్కూల్లో బాలికల హాస్టల్ నిర్వహణ జరుగుతుంది. అందులో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అల్పాహారం అందించడం లేదని అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నామని విద్యార్థులు అక్టోబర్ 23న హాస్టల్ ప్రాంగణంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. ఈ విషయంపై ప్రజాపక్షం పత్రికలో వారి బాధలు వర్ణనాతీతం శీర్షికన కథనం వెలువడింది. మరుసటి రోజు జిల్లా స్థాయి కల్లూరు సబ్ కలెక్టర్, తహశీల్దార్, యం ఇ ఓ అధికారులు హాస్టల్లో సందర్శించి విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను సిద్ధం చేసి జిల్లా విద్యాశాఖ అధికారిక అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ఏడుగురు ఉద్యోగులు కేర్ అరుణ కుమారి, ఏఎన్‌ఎం ఇస్తేరు, హెడ్ కుక్ టి. పుల్లమ్మ, అసిస్టెంట్ కుక్ లు రమాదేవి, జి. రాధ, వాచ్మెన్ నాగశిరోమణి, స్కేవెంజర్ కృష్ణవేణి లను విధుల నుండి పూర్తిగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఓ వెంకటరమణ ఇంచార్జ్ భాధ్యతల నుండి తప్పించి కేవలం కేజీబీవీ లో పూర్తిస్థాయి విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం పై స్థానిక తహశీల్దార్, యం ఇ ఓ మాట్లాడుతూ తెలిపారు. సిబ్బంది వచ్చేవరకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ వంట సైతం తాత్కాలికం గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాస్టల్ సిబ్బంది పై తీసుకున్న చర్యల పట్ల విద్యార్దునులు ఆనందం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎవరి పైన అయినా చర్యలు ఉంటాయనే సంకేతకం పట్ల పలువురు నిర్లక్ష్యం వహించే ఉద్యగుల గుండెల్లో భయం నెలకొంది. ఉద్యోగుల పై చర్యలతో సరి పెట్టకుండా హాస్టల్ లో సమస్యలు తీర్చాలని విద్యార్థునుల తల్లి తండ్రులు కోరుతున్నారు.

## గంజాయి నూనె పట్టివేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని ఆపిల్ సెంటర్‌లో రూ. 30 లక్షల విలువ గల హషీష్ ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఖమ్మం ఏసిపి పర్యవేక్షణలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో పోలీసులు వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో రూ. 30 లక్షల విలువ గల గంజాయి ఆయిల్ ఉండడంతో వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఒకరు ఖమ్మం వైఎస్ఆర్ కాలనీకి చెందిన కొత్తా రాము కాగా మరొకరు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సమీపంలో తొర్రెడుకు చెందిన శరత్ జానకిరామయ్య. ఈ సందర్భంగా రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి అమ్మకాలను ప్రోత్సహించవద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల చట్టం పోస్టర్ ఆవిష్కరించిన మెజిస్ట్రేట్



**ప్రజాపక్షం/భద్రాచలం :** కోర్టు ప్రాంగణంలో దివ్యాంగుల దివ్యాంగుల చట్టం 2016 పోస్టర్‌ను భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేటర్ శివనాయక్ ఆవిష్కరించారు. కోర్టు ప్రాంగణంలో భద్రాద్రి ఫిజికల్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఊటుకూరి సాయిరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెజిస్ట్రేట్ మాట్లాడుతూ దివ్యాంగులకు అనేక రకాల చట్టాలు ఉన్నాయని, సమాజంలోస్వయం ఉపాధి ద్వారా సొంతకాళ్లపై నిలబడి వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలన్నారు. 2016 దివ్యాంగుల చట్టం 92/ఏ ప్కారం దివ్యాంగులను కించపరిచినా, అవయ లోపాలతో అవమాన పరిచినా, గాయపరిచినా, పరికరాలు ధ్వంసం చేసినా, లైంగికంగా వేదించినా రెండేళ్ల నుండి ఐదేళ్లపాటు జైలు శిక్ష, 5 లక్షల జరీమానా విధించబడుతుందని తెలిపారు. దివ్యాంగులకు ఎలాంటి అన్యా యం జరిగినా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, అక్కడ ఫిర్యాదు తీసుకోకుంటే నేరుగా శనివారం కోర్టులో దివ్యాంగుల సమస్యలపై ఫిర్యాదు చేసుకుని చట్ట పరమైన న్యాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నం సత్తిబాబు, అలవాల రాజా, మర్మం శంకర్, మిట్టపల్లి నరేంద్ర, రమేష్, లక్ష్మ య్య, శ్రీను పాల్గొన్నారు.

# ప్రభాకర్‌కు డాక్టరేట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలోని ఎస్‌బిఐటి కళాశాలలో సిఎస్ఈ విభాగాపు ఆచార్యుడు జి. ప్రభాకర్ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ విషయాన్ని శనివారం ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. యెనహాన్స్‌డ్ మెథాడాలజీస్ ఫర్ డేటా సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ ఎన్విరాన్‌మెంట్ యుజింగ్ డిప్ లెర్నింగ్ మోడల్స్ అనే అంశంపై డా॥ బొబ్బ బసవేశ్వరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ టెక్నాలజీ రంగంపై పరిశోధన చేయడం ద్వారా కళాశాల విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని సిఎస్ఈ విభాగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రభాకర్ చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన వారు. ప్రభాకర్‌ను కళాశాల కరస్పాండెంట్ జి. ధాత్రి, డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, డా॥ జే. రవీంద్రబాబు తదితరులు అభినందించారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజాపక్షం/మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు శనివారం మధిర మున్సిపాల్టీ పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వర్షం కురిసినప్పుడు జలమయమయ్యే కాలనీలు, వరద ఇబ్బంది పడే లోతట్టు ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. మధిర మున్సిపాల్టీలోని హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీలను క్షేత్రస్థాయిలో కాలినడకన తిరుగుతూ వరద ప్రభావ పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల వరద ముంపుకు శాశ్వతంగా సమస్య పరిష్కారానికి టౌన్ మ్యాప్‌లను పరిశీలిస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక ప్రజలతో కలెక్టర్ మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టామ్ వాటర్ డ్రైయిన్లు రోడ్లు వెడల్పు పెంచాలని ప్రజలందరూ దీనికి సహకరిస్తే డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం మధిర మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులతో పట్టణ అభివృద్ధి పనులు, శానిటేషన్, వరద లోతట్టు ప్రాంతాల పరిరక్షణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధిర పెద్ద చెరువు బ్యాక్ వాటర్ ప్రభావం వలన లోతట్టు ప్రాంతాల వరద నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. మధిర పట్టణంలో చెత్తను పూర్తిగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలని, రహదారుల వెంట చెత్త కన్పించకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మధిర పెద్ద చెరువు ట్యాంకుల ఏర్పాటు, పటిష్ట కల్వర్టర్ల నిర్మాణం స్టామ్ వాటర్ సైడ్‌డ్రైన్లు నిర్మాణానికి ప్రతిపాదనలు అందచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరదనీరు వెళ్లిపోవడానికి మున్సిపల్ అధికారులు రూపొందించిన డ్రైనేజి ప్రణాళికలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ నాగబ్రహ్మం, ఆర్అండ్‌బి డిఇ శంకర్, తహశీల్దార్ రాంబాబు, కమీషనర్ సంపత్‌కుమార్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు





ప్రజాపక్షం/వైరా: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగపరచుకోవాలని వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ గురుస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరచుకొని ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది గద్ద నీరజ, సునీత, ఆది రజిని, నాగమణి, జయశ్రీ, దుర్గ, రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వీరంశెట్టి సీతారాములు, గొల్లపూడి కృష్ణారావు, శానిటేషన్ అధికారి వీరన్న, ఏఈవో రాజేష్, పలువురు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షరాస్యత సాధనకు కృషి చేయాలి




ప్రజాపక్షం/కల్లూరు: అక్షరాస్యత సాధనకు గ్రామ సమైక్యలు వాలంటీర్లు కృషిచేయాలని ఐకెపి ఎపిఎం అశోక్ రాణి, సిఅర్పిలు నాగేశ్వరమ్మ ఫాతిమాబేగం లు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్త్రీ శక్తి భవనంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 23 గ్రామపంచాయతీలలో నిరక్షరాశుల సర్వే నిర్వహించడం జరిగిందని, వారిని అక్షరాసులుగా చేసేందుకు వాలంటీర్లు గ్రామ సమాఖ్యలు వివోఏలు కృషి చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం తీసుకున్నందున సంవత్సరం లోపల వారిని అక్షరాస్యులుగా చేయాలని ఈ బాధ్యత అందరిపై ఉందని ప్రతి రోజు ఓ గంట వారికి పంపిణీ చేసిన పుస్తకాలు ద్వారా చదువును నేర్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు, గ్రామ సమైక్యలు, సీసీలు పాల్గొన్నారు.

# జమలాపురం శ్రీ వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వస్వామి వారికి శనివారం తెల్లవారుజాము నుండే ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పంచామృతాలతో సర్వాంభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ,అమ్మవార్లకు నిత్యా కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి ఆలయంతో పాటు అన్ని ఉపాలయాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమమొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు చేసి స్వామి వారికి నివేదించారు. ఆలయానికి వచ్చిన భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా ప్రధానార్చకులు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా దేవాదాయ ధర్మదాయ కమీషనర్ ఆదేశాల మేరకు స్వామి వారి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్తీక మాసం ప్రతి సోమవారం సాయంత్రం 5.30 సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో తెలిపి తమ పేర్లను నమోదు చేసుకోవాలి అన్నారు. కార్తీక మాసంలోని నాలుగు సోమవారాలు, రెండు ఏకదాశుల్లో ఈ సత్యనాయణ వ్రతాలు జరుగుతాయని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా 48మంది దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ సిబ్బంది సోమయ్య, కృష్ణప్రసాద్, వేదపండితులు విజయలక్ష్మి, సాయి అభిలాష్‌శర్మ, ముఖ్య అర్చకులు ఎం.వెంకటరమణ, రఘురామకృష్ణ శాస్త్రి, అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్ శర్మ, రామకృష్ణ శాస్త్రి, చక్రధర్, సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయానికి వచ్చిన భక్తులకు, అయ్యప్ప భక్తలకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల సహకారంతో ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యదర్శి లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు ఎన్టీఆర్ జిల్లా కానూరు గ్రామానికి చెందిన శివరామకృష్ణ, నీలిమ, వాసిరెడ్డి దుర్గాప్రసాద్, అరుణ దంపతుల వితరణతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు, భక్తులు, అయ్యప్పలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు, స్థల దాత కోడాలి విజయలక్ష్మి దేవి అధ్యక్షల బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు గిరిజాలక్ష్మి ఇమిడి ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింత కిషోర్, కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, లీలాకృష్ణ, ఆలయ మాజీ ఇఓ అల్లూరి కృష్ణమూర్తి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# కుటుంబ సభ్యుల వేధింపులతో రోడ్డెక్కిన మహిళ



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : మండల పరిధిలోని రామన్నపాలెంకు చెందిన తాళ్లూరి రాజారావు భార్య సువార్తమ్మను భర్త రాజారావు, ఆడబిడ్డలు, అల్లుళ్లు, బంధువులు వేధింపులకు గురి చేస్తునట్లు ఓ మహిళ రోడ్డెక్కిన సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రామన్నపాలెం గ్రామానికి చెందిన తాళ్ళూరి రాజారావు మధిర మండలం తొర్లపాడు గ్రామానికి చెందిన సువార్తను 3వ సంబంధంగా ఇరుకుటుంబాల పెద్ద మనుషుల సమక్షంలో 25 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా నా మొదటి సంబంధం పిల్లల చదువులు, పెళ్లిలు, కాన్పులు అయిపోయాయి, ఇప్పుడు నాకు వయస్సు సహకరించటం లేదు, నీ అవసరం నాకు, నా పిల్లలకు, నా కుటుంబానికి లేదని, నీ దారి నీవు చూసుకోవాలని అంటూ రాజారావు ఆడపడుచులు, బంధువులు తనను అవమానపర్చి రోడ్డు మీద నెట్టివేశారని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని సువార్తమ్మ రోడ్డుపై బైఠాయించింది. తనకు న్యాయం చేయాలని, తనను అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్లు సువార్తమ్మ తెలిపారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ పంపిణీ




ప్రజాపక్షం/వైరా: మహిళలు ఆర్థికంగా తోడ్పాటును ఇచ్చే విధంగా కుట్టుమిషన్లు ఉపయోగపడతాయని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రి నందు వైరాకు చెందిన ఇద్దరు నిరుపేద మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేసి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఎంతోమంది మహిళలకు, వారి ఉపాధికి ఉపయోగపడే విధంగా పలు రకాలుగా సహాయ సహకారాలు అందించడం జరిగిందని, భవిష్యత్తులో నిజమైన నిరుపేదలకు ఇదేవిధంగా సహకారం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్, కోఆర్డినేటర్ యు.శ్యామ్‌బాబు, రీజన్ సెక్రటరీ పెనుగొండ ఉపేంద్రరావు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారి గద్దె నీరజ తదితరులు పాల్గొని వైరాకు చెందిన పఠాన్ గౌస్‌బేగం, షేక్ చిన్న పుల్లాబిలకు కుట్టుమిషన్లు అందజేశారు.

# కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలి




ప్రజాపక్షం/ మధిర : కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర బోడేపూడి భవనంలో శనివారం మధిర సిఐటియు మండల మహాసభ చావా పద్మ, సృజన, అన్నం వెంకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు పర్చాలని, పిఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును మార్చుకోకపోతే భవిష్యత్‌లో కార్మికులతో ఉద్యమాలు చేపడుతామని అన్నారు. అదేవిధంగా ఖమ్మంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని, ఖమ్మం జిల్లా సిఐటియు కార్యాలయ ప్రారంభానికి కార్మికులు వేలాది సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం, సిఐటియు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో చేరిన రామ లక్ష్మణ్ : కల్లూరి



**ప్రజాపక్షం/చర్ల :** కమ్యూనిస్టు పార్టీలోకి యువత రావడం శుభ పరిణామం అని, చర్లకు చెందిన రామలక్ష్మణ్ చేరడం అభినందనీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా కల్లూరి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కల్లూరి మాట్లాడుతూ సిపిఐకి ఆకర్షితుడై పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా రావడం గర్వకారణం అన్నారు. సిపిఐ కార్యకర్తలకు, ప్రజలకు అండదండగా ఉంటుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, చల్లా లక్ష్మీనారాయణ సమక్ష్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయం సీతారామమ్మ, కాకర్ల అనసూయ, జానికిరావు, లక్ష్మీ, రేసు రమణమ్మ, సీతారాం, రమణ, కాకర్ల రాధ, జయమ్మ, ధనలక్ష్మీ, వైష్ణవి, చుక్కయ్య, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిసి కెమేరాలను గదికి వెళ్లిన ఆయన సిసి కెమేరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోదాము పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి రానివ్వొద్దని సెక్యూరిటి గార్డును ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులకు అవగాహన అవసరం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కోర్టు కేసుల విషయంలో ఫోరెన్సిక్ సాక్ష్యం కీలకపాత్ర పోషిస్తుందని, న్యాయవాదులు దానిపై అవగాహన పెంచుకోవడం ఎంతైనా అవసరమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తి పి వసంత్ అన్నారు. శనివారం జిల్లా న్యాయవాదుల లైబ్రరీహాల్లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు కేసుల్లో ఫోరెన్సిక్ సాక్ష్యం ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ భారత సాక్ష్యం చట్టంలో ఫోరెన్సిక్ సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి పరిశోధనలు నేటి రోజుల్లో ఎంతైనా అవసరమన్నారు. న్యాయవాదులు ఈ రంగంపై పూర్తి అవగాహనపెంచుకుని నేర్చుకోవాలని చెప్పారు. జిల్లా న్యాయమూర్తి సరిత, న్యాయమూర్తులు ఎం రాజేందర్, కె కిరణ్ కుమార్, కే కవిత, సాయి శ్రీ, రాజమల్లు, బారి అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణతో పాటు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## బ్రహ్మారెడ్డి చిత్రపటానికి పలువురు నివాళి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం గన్నవరం గ్రామంలో ఇటీవల మరణించిన ప్రైవేటు ఎలక్ట్రీషన్ సంఘం సభ్యుడు శీలం బ్రహ్మారెడ్డి దశదిన కర్మలకు ఖమ్మం ప్రైవేటు ఎలక్ట్రీషన్ సంఘం కోశాధికారి ఉపేంద్ర, వైరా మండల ప్రైవేటు ఎలక్ట్రికల్ సంఘం అధ్యక్షులు గారపాటి అశోక్ ఆర్థిక చేయూత అందించి బ్రహ్మారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో దారా వెంకన్న, దాసరి, బోనాల శ్రీనివాసరావు, ఆర్‌విఎస్.చారి, కాజాపీర్, మూర్తి, ఆదోని సుధాకర్‌రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మెచ్చా



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని పొగళ్లపల్లి గ్రామంలో తాండ్ర నారాయణరావు ట్రస్ట్ అధ్యక్షులు తాండ్ర వెంకటేశ్వరరావు నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన గృహం నందు ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో నరాటి ప్రసాద్, మోరంపూడి అప్పారావు, ఇనుగంటి రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఖాదర్‌బాబు ఆశయసాధనకు శ్రమించాలి

**- తుదిశ్వాశదాకా పార్టీ విస్తరణకు కృషి**
**- ఘనంగా ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు వర్ధంతి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పేద ప్రజలు, కార్మికులతో మమేకమై తన తుదిశ్వాశ వరకు వారి అభ్యున్నతి కోసం శ్రమించిన ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు ప్రజల గుండెల్లో నిలిచిపోయారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సమితి సభ్యులు, మాజీ మున్సిపాలిటి కౌన్సిలర్ ఉప్పుశెట్టి ఖాదర్ బాబు 8వ, వర్ధంతి వేడుకలను పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లోని ఖాదర్‌బాబు స్మారక స్థూపం వద్ద సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. స్మారక స్థూపానికి కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ ఏఐఎస్‌ఎఫ్ నేతగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఖాదర్‌బాబు అంచలంచలుగా జిల్లా స్థాయి నేతగా, పేదల నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం అనునిత్యం పాటుపడేవారని అన్నారు. పాల్వంచ ప్రాంత ప్రజలను కమ్యూనిస్టు ఉద్యమాల వైపు మళ్ళించి పార్టీ విస్తరణలో ప్రముఖపాత్ర వహించాడని కొనియాడారు. ఖాదర్‌బాబు లేనిలోటు వ్యక్తిగతంగా తనకు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరి మద్యన ఉన్న స్మృతులను గుర్తుకు చేసుకొన్నారు.పాల్వంచ మున్సిపాలిటి ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా పాల్వంచ ప్రాంతంలో చెరగని ముద్రవేశాడని, ఆయన ఆశయాలను సాధించిన నాడే ఆయనకు ఘనమైన నివాళులన్నారు. ఈ బాద్యతలను స్వీకరించి ఆయన ఆశయాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించి తద్వారా పాల్వంచ ప్రాంతంలో సిపిఐని అగ్రస్థానంలో నిలబెటదటడానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, వి. పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకటరావు, ఉప్పుశెట్టి సునిల్, లాయర్ యాస యుగేందర్, మౌనిక, ప్రజా సంఘాల నాయకులు శనగారపు శ్రీనివాసరావు, డి. చెన్నయ్య, నరహరి నాగేశ్వరరావు, మన్నెం వెంకన్న, నాగమల్ల సత్యనారాయణ, చేరాలు, అరవింద్, సంజీవరావు, గోపాల్, రవి, కిరణ్, వెంకట్‌రెడ్డి, అల్లి వెంకటేశ్వర్లు, రాము, శ్రీను, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల వినూత్న నిరసన

**- పురవీధుల్లో బిక్షాటన**
**- పేద విద్యార్థులతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం**
**- బకాయిలు వెంటనే విడుదల చేయాలి**
**- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వవిధానాలను నిరశిస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు పురవీధుల్లో బిక్షాటన చేస్తూ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకుంటున్న కాలేజీల్లో రూ.8౩ వేల కోట్లకు పైగా ఫీజు రియింబర్స్మెంట్, ఉపకార వేతనాల బకాయిలు ఉన్నప్పటికీ వాటిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం దుర్మార్గం అన్నారు. గత నాలుగేళ్లుగా విడుదల కాక కాలేజీ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని, లేదంటే సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కనీసం పట్టడం లేదన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుందని అన్నారు. బకాయిలు ఇవ్వాలంటూ యాజమాన్యాలు సైతం కాలేజీలు బంద్ చేస్తుంటే విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నప్పటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు శ్రద్ధ తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే ఏఐఎస్‌ఎఫ్ చూస్తూ ఊరుకోదని, తక్షణమే బకాయిలు విడుదల చేయకుంటే అధికార ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, నాయకులు పవన్, మహేష్, కళ్యాణ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల అంజితో ప్రాణహాని ఉంది

**- మాకేది జరిగినా ఆయనదే బాధ్యత : వేముల దుర్గారావు**





**ప్రజాపక్షం/పాల్వంచ :** ములకలపల్లి మాజీ జెడ్‌పిటిసి బత్తుల అంజితో ప్రాణహాని ఉందని, తమ కుటుంబానికి ఏదైనా జరిగితే ఆయనదే బాద్యత అని అంజి సోదరి భర్త వేముల దుర్గారావు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ బత్తుల అంజి సోదరితో గత పద్నాలుగు సంవత్సరాల క్రితం వివాహం అయిందని, మాకు ఇద్దరు పిల్లలు సంతానం కలిగిందని తెలిపారు. అనంతరం తలెత్తిన మనస్పర్థలతో తన అన్న అంజి ప్రోద్భలంతో 2024 జూలై నెలలో నాపై, నా కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు పెట్టి జైలుకు పంపించారు. కొన్ని రోజులకు తిరిగి వచ్చిన తరువాత చట్ట ప్రకారం ఇద్దరు పిల్లలను తన వద్ద ఉంచుకోకుండా నా వద్దకు పంపించడం జరిగింది. నేను నా కారులో నా పిల్లలు, మా అక్క పిల్లలతో కలిసి కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించడానికి వెళ్ళాము. అనంతరం కొత్తగూడెం లక్ష్మిదేవిపల్లిలోని ఎగ్జిబిషన్‌కు వెళదామని వెళ్ళాము. అక్కడికి నా భార్య సోదరుడైన బత్తుల అంజి మరో ఇద్దరు వ్యక్తులు కలిసి వచ్చి కారులో ఉన్న నాపై మారణాయుధాలతో దాడి చేసి నాపిల్లలను బయటకు లాగే క్రమంలో భయపడిన నేను వారి వద్దనుండి తప్పించుకొని ములకలపల్లికి వెళుతున్న క్రమంలో నన్ను వెంబడించి భయభ్రాంతులకు గురిచేసి హాత్యాయత్నం చేయటానికి ప్రయత్నించటంతో దగ్గరలోని పాల్వంచ పోలీస్ స్టేషన్‌కు చేరుకొన్నారు. ఫిర్యాదు చేయటానికి పోతున్న నన్ను వెంబడించి బూతులు తిడుతూ స్టేషన్‌లో కొట్టాడు. దీనిని గమనించిన పోలీస్ సిబ్బంది వారించారు.అనంతరం నన్ను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకొంటున్న నన్ను చూడటానికి వస్తున్న మా బావగారైన ఈర్ల గాంధిపై కూడా విచక్షణా రహితంగా రాడ్‌తో దాడి చేసి తలపై కొట్టారు. దీనితో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో తలకు 14 కుట్లు వేశారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సూచన మేరకు కొత్తగూడెం తరలించాము. కండీషన్ విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఆయనకు రాజకీయాలలో మా కుటుంబం సహకరించటం లేదనే మాపై కక్ష్య గట్టి మా భార్యా భర్తలను విడగొట్టి మా కుటుంబాన్ని మొత్తానికి హతమార్చాలనే కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. నాకు గానీ నా కుటుంబ సభ్యులకు గానీ ఏ హాని జరిగినా ఆయనదే పూర్తి బాద్యత అన్నారు. అధికారులు స్పందించి బత్తుల అంజి నుండి మమ్ములను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ఈర్ల కిరణ్, బత్తుల కనక తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై బత్తుల అంజిని ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# 33శాతం పైగా దెబ్బతిన్న పంటలకే పరిహారం

**-జిల్లాలో 62 వేల ఎకరాలలో పంట నష్టం**
**-జిల్లా వ్యాప్తంగా 327 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు**
**-జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో వరి, మిర్చి, పత్తి పంటలు మొత్తం 62 వేల ఎకరాలలో ప్రాథమిక నష్టం ను అంచనా వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలం లోని బోదులబండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ను శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. యూరియా విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు అన్ని రకాల పంటలు మొత్తం 62 వేల ఎకరాలలో నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా తయారు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ఎకరానికి రూ.10 వేల పరిహారం కనీసం 33 శాతం కు పైగా పంటలు దెబ్బతింటేనే వస్తుందని అన్నారు. తడిసిన పంటలను అధికారుల సూచనల మేరకు మెళుకువలు పాటించి రైతులు పంటలను కాపాడుకోవాలని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 327 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించకుండా మద్దతు ధర ను పొందాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాకు ఇటీవలనే దాదాపు 4 వేల మెట్రిక్టన్నుల యూరియా వచ్చినట్లు తెలిపారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందనవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు అవినాష్, అరవింద్, సోసైటీ సీఈవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నుండి ఇల్లందు వెళ్లే రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం నుండి ఇల్లందు రహదారి వర్షాలకు దెబ్బతిని మోకాల్లోతు గుంటలు ఏర్పడి నిత్యం వాహనదారులు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని మాజీ జెడ్పిటిసి, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకురాలు చంద్ర అరుణ అన్నారు. శనివారం కారేపల్లిలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణికులు తిరుగుతున్న రద్దీ రుట్లలో ఇన్ని రోజులుగా గుంతలు పడి ఇబ్బంది పడుతున్న అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బాలింతలు, వృద్ధులు, పిల్లలు ద్విచక్ర వాహనదారులు అనేకసార్లు ప్రమాదాల గురై ప్రాణ ప్రాయ స్థితి నుండి బయటపడ్డా కూడా పాలకులు స్పందించరా అని ప్రశ్నించారు. మరీ ముఖ్యంగా కొమ్ముగూడెం, లింగాల క్రాస్ రోడ్, కరెంట్ ఆఫీస్, లలితాపురం, తదితర ప్రాంతాలలో మరింతగా దెబ్బతిన్నదని ఆరోపించారు. వైరా ఎంఎల్ఏ స్పందించి తక్షణమే తాత్కాలిక మరమ్మతులైన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఎకరానికి 50వేలు రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూమి కోసం భుక్తి కోసం ఈ దేశం కోసం తమ విలువైన ప్రాణాలు త్యాగం చేసిన అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ ఒకటి నుండి తొమ్మిదో తారీఖు వరకు గ్రామ గ్రామాన అమరవీరుల సభలు చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, రైతు సంఘం నాయకుడు తేజ నాయక్, ఇల్లందు పట్టణ కార్యదర్శి పాయ వెంకన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కల్లాలు లేక రైతుల కష్టాలు..!



**20 కిలోమీటర్ల మేర రోడ్డు ఇరువైపులా ధాన్యం ఆరబోత**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేక రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ రబీలో పత్తి, మిర్చి, వరి ధాన్యం ఆరబోసేందుకు గ్రామాలలో కల్లాలు లేనందున రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, మర్లపాడు, తాళ్లూరు వెంకటాపురం, పోచవరం, పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం, లింగాల ,బత్తులపల్లి, వెన్నవల్లి, పేరు వంచ తదితర గ్రామాలలో పత్తి, మిర్చి, వరి పంటలను సాగు చేసే రైతులకు పంటలను ఆరబోసేందుకు కల్లాలు లేక కష్టాలు పడుతున్నారు. మండలంలో 44 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా 22 వేల మంది రైతులు పలు రకాల పంటలను సాగు చేస్తూ ఉన్నారు. ఈ పంటలు ఖరీఫ్ రబీలో వచ్చిన వాటిని తేమశాతం తగ్గేవరకు పంటలను అమ్ముకునేందుకు నాణ్యత ప్రమాణాలను పాటించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకుపోవాలంటే తప్పనిసరిగా పంటలను ఆరబోయాల్సిందే. దీనికిగాను ప్రధాన గ్రామాలైన గ్రామీణ ప్రాంతాలలో కల్లాలు తప్పనిసరిగా ఉండాలి కానీ గత్యంతరం లేనందున ప్రధాన రహదారులపైనే వరి ధాన్యం ఆరబోస్తున్నారు. మండల పరిధిలోని కల్లూరు నుంచి దారుక బంజర వరకు 20 కిలోమీటర్ల మేర రోడ్డు ఇరువైపులా ధాన్యం ఆరబోసుకుంటున్నారు. లింగాల టు ఎర్రబోయినపల్లి, పేరువంచ, బత్తులపల్లి, లక్ష్మీ పురం, పుల్లయ్య బంజర రహదారులు ఈ నెల నుంచి జనవరి వరకు రోడ్లు ఇరువైపులా ఆరబోసుకుంటూ ఉంటారు. రైతులు సౌకర్యార్థం నాణ్యత ప్రమాణాలు కొరకు ఆరబోసుకుంటూ ఉంటారు. కానీ రోడ్లు ఇరువైపులా ధాన్యం ఉండుటవలన ప్రయాణికులకు, వాహనదారులకు, బాటసారులకు ఈ మూడు నెలలు పాటు పలు జాగ్రత్తలు తో తప్పనిసరిగా రోడ్లపై ప్రయాణంతో పాట్లు తప్పవని వారు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఈజీఎస్ ఏపీవో ను వివరణ కోరగా గతంలో కల్లాలు 11 ఉండేవని ఇప్పుడు అవి వినియోగంలో లేవని తెలిపారు.

## అమరవీరుల వర్ధంతులు గ్రామ గ్రామాన జరపండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల వర్ధంతులు గ్రామ గ్రామన జరపాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బట్టు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం బత్తిన సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బట్టు సురేష్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం ఆయుధాన్ని చేతపట్టి సాయుధంగా ముందు నడిసి శత్రువు తుపాకీ తుటకు గుండెను ఎదురొడ్డి నిలిసి ఎర్రజెండాను తమ నెత్తురు అది రేపటి ఉషోదయం కోసం అస్తమించిన అన్నలు, పోరాటంలో ఎంతో మంది అన్నలు అమరులు అయ్యారని అన్నారు. వాళ్ళ అందరికీ పేరు పేరున విప్లవ జోహార్లు అర్పిస్తూ, ఆళ్లపల్లి మండలంలో ఆనంతోగు, లక్ష్మీపురం, మైలారం, రాయిగూడెం, మర్కోడ్, ఇప్పనపల్లి గ్రామాల్లో అమరులకి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో బతిని సత్యం, మెస్సు గోపాల్, పూనం లక్ష్మన్, మంగ, రవి, బక్కన్న, చిరంజీవి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.81 లక్షల పరిహారం చెక్కు అందజేత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని కోరట్లగూడెం గ్రామానికి చెందిన బాధితులకు శనివారం పరిహారం చెక్కు ను అందించారు. గత 27 ఏళ్ల క్రితం ఖమ్మం రూరల్ మండలం లోని వెంకటగిరి సమీపంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో కొత్తపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మృతి చెందాడు. పరిహారం చెల్లింపులలో వివిధ కారణాల వలన జాప్యం జరిగింది. కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు చోరవ తీసుకుని పరిహారం అందించేలా కృషి చేశారు. ఈ మేరకు శనివారం మృతుడు కుటుంబ సభ్యులకు రూ.2.81.321 చెక్కు ను కార్మిక శాఖ అధికారి కృష్ణవేణి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ షేక్ జహీరాబీ, కొత్తపల్లి సుబ్బారావు, బచ్చలకూరి ఉదయ్, ప్రతాప్, కొత్తపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

**-ధాన్యం ట్రాక్టర్ పల్టీ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని బోదులబండలో తృటిలో ఓ ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతు శనివారం తన పొలం లో పండించిన ధాన్యం ను ట్రాక్టర్ ద్వారా ఇంటికి తీసుకొస్తున్నారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. డ్రైవర్ చాకచాక్యంగా తప్పించుకున్నారు. దాదాపు 40 క్వింటాల ధాన్యం నేలపాలైంది.

## కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లిలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఓ దిన పత్రిక విలేకరి గురువారం ఇచ్చుట ప్రభుత్వ భూములు అమ్మబడును అనే శీర్షికతో ప్రభుత్వ భూములు అక్రమానల్లో కాంగ్రెస్ పార్టీ అనుచరులు ఉన్నారని అవాస్తవాలు ప్రచురించారని, ఇలాంటి తప్పుడు రాతలు రాస్తే ఊరుకునేది లేదని శనివారం పత్రిక విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాయం రామ నరసయ్య హెచ్చరించారు. విలేకరు ముసుగులో ఆ దినపత్రిక విలేకరి బెదిరంపులకు పాల్పడటం, అందరికి తెలిసిందే అని పార్టీ వ్యక్తులపై సంబంధం లేని అధికారులపై అసత్య ఆరోపణలు చేయడం మంచిది కాదని ఈ ఆరోపణలు నిరూపణ చేయకపోతే తనను కాంగ్రెస్ పార్టీ తరపున వదిలేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అతహర్, కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, నాయకులు తాళ్లపల్లి వెంకన్న, కరకపల్లి సుధాకర్, బుర్ర వెంకన్న, తులం ముత్తిలింగం, సుతారి క్రిష్ణ, మోకాళ్ళ శేఖర్, చింత బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ఉచ్చులో పడ్డ వ్యాపారి..!



**- రూ.9.20 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**
**- మధిరలో వరుస సంఘటనలతో వ్యాపారుల్లో ఆందోళన**

**ప్రజాపక్షం/ మధిర :** ప్రస్తుత సమాజంలో అందిపుచ్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కొందరు ఈజి మని కోసం అడ్డదారులు వెతుకుతూ సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయక ప్రజలను టార్గెట్‌గా పెట్టుకుని వారి ఖాతాల్లో నుండి డబ్బులను కాజేస్తున్న సంఘటనలు నిత్యం జరుగుతున్నాయి. మధిరలో కూడా వరుస సంఘటనలతో వ్యాపారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మధిర పట్టణంలోని ఓ వ్యాపారి సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి తన ఖాతాలో ఉన్న డబ్బును పోగొట్టుకున్న సంఘటన చోటుచేసుకుంది. మధిర పట్టణానికి చెందిన వ్యాపారికి శుక్రవారం రాత్రి ఒక లింకు రావడంతో దానిని ఓపెన్ చేయటంతో తన అకౌంట్‌లో రూ.9.20లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చిందని, దీంతో ఆందోళన చెందిన సదరు వ్యాపారి స్థానిక పోలీసులను ఆశ్రయించగా సైబర్ నేరగాళ్లు చేసిన పనిగా ధృవీకరించారు. దీంతో బాధిత వ్యాపారి శనివారం ఖమ్మం సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఫోన్లకు మనకు తెలియకుండా వచ్చే మెసెజ్‌లు, లింకులను, యాప్‌లను ఓపెన్ చేయవద్దని స్థానిక పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేడు వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ

**విగ్రహం ఆవిష్కరణకు రానున్న రంగా తనయుడు రాధా**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నేడు విజయవాడ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుపనున్నట్లు సత్తుపల్లి మున్నూరు కాపు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా విగ్రహాల సమూహం వద్ద వంగవీటి మోహన రంగా ఏడు అడుగుల కాంస్య విగ్రహాన్ని రంగా తనయుడు విజయవాడ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా తనయుడు వంగవీటి రాధా ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు రంగిశెట్టి చంటి కాలినేని సాయి, తోట గణేష్ బాబు, పెద్దిరెడ్డి పురుషోత్తం, నల్లాకుల సూరిబాబు, బత్తుల రాంబాబు, హరి, కురిసేట్టి హరి మూలగుండ్ల అప్పారావు తదితరులు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం సత్తుపల్లి మున్నూరు కాపు వన సమారాధన కార్యక్రమం జరగనుందని వారు వివరించారు. ఆవిష్కరణకు ముందు భారీ కార్ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వరమే కృషి చేయాలి




**- 15న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి**
**- ఎస్‌పి రోహిత్ రాజ్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయాధికారులను సమన్వయం పాటిస్తూ పోలీస్ అధికారులు సత్వరమే కృషి చేయాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఈమేరకు శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజీపడదగ కేసులు ఇరు వర్గాల వారి నిర్ణయాలతో కొన్ని కేసులు ఈనెల 15న జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్ పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న విషయాలకు కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగడం కన్నా రాజీపడటమే ఉత్తమమైన మార్గమని వివరిస్తూ పరిష్కారం దిశగా తీసుకెళ్లాలన్నారు. క్రిమినల్ కేసుల్లో కేసుల తీవ్రతను బట్టి త్వరితగతిన శిక్షలు పడేలా కన్విక్షన్ రేటును పెంచాలన్నారు. ఎప్పటికప్పుడు కేసుల పురోగతిని పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల సలహాతో ముందుకు సాగాలన్నారు. బాధితులకు న్యాయం చేకూర్చడమే సక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కేసుల పరిష్కారం విషయాల్లో ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, డిఎస్‌పిలు, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కాంటాలో తేడాలు..!

**వే బ్రిడ్జి నిర్వాహకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓ రైతు ధాన్యం ను వే బ్రిడ్జి వద్ద కాంటా వేయగా తేడా వచ్చింది. రైతులను మోసం చేస్తున్న నిర్వహాకుల పై బాధిత రైతు స్థానిక పోలీసే స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలం లోని మాధాపురం గ్రామానికి చెందిన కె. గోపిరెడ్డి అనే రైతు తను పండించిన ధాన్యం ను నేలకొండపల్లి మండలం లోని ఓ వ్యాపారికి విక్రయించాడు. మొత్తం 253 బస్తాలు విక్రయించాడు. వాటిని కాంటా వేయించేందుకు మండలం లోని ఓ వేబ్రిడ్జి వద్ద కాంటా వేయించారు. అక్కడ 23,440 కేజీలు తూక వచ్చింది. దీంతో రైతుకు కాంటాలో తేడాలు అనిపించింది. అనుమానం తో సిబ్బంది ని నిలదీయగా....నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో మరో చోట కాంటా వేయించుకోమని చెప్పటంతో చేసేది లేక మండలం లోని ఓ రైస్ మిల్లు వద్ద కాంటా వేయించాడు. మిల్లు వద్ద 26,370 కేజీలు కాంటా వచ్చింది. అంటే రైతు కు 2,930 కేజీలు తేడా వచ్చింది. దీంతో రైతు అగ్రహం వ్యక్తం చేసి వే బ్రిడ్జి నిర్వహాకులు మోసం పై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు స్థానిక పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై సంతోష్ ను వివరణ కోరగా....ఫిర్యాదు పై విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

# ముగ్గురు మహిళలపై బ్లేడ్‌తో దాడి

**ప్రజాపక్షం/భద్రాచలం :** మద్యం మత్తులో ఓ యువకుడు ముగ్గురు మహిళలపై బ్లేడ్‌తో దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన ఖాసీం మద్యం మత్తులో తన అత్త అమీదా అనే మహిళపై బ్లేడ్‌తో దాడికి చేయడంతో గొంతు తెగి రక్తం వస్తుండగా అమీద సోదరి ఫాతిమా అడ్డు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా ప్రక్కనే ఉన్న కర్రతో బలంగా ఆమె తలపై మోదడంతో తల పగిలింది. అదే క్రమంలో అక్కడే ఉన్న అతని భార్య జాస్మిన్‌పై కూడా కర్రతో దాడి చేయగా ఆమెకు కూడా బలమైన గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ప్రభుత్వం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మైనర్ బాలికపై అత్యాచారం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మైనర్ బాలికపై ఇద్దరు మైనర్ బాలురు ఒక మేజర్ యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం ఇద్దరు మైనర్ బాలురు మేజర్ అరవింద్ ముగ్గురు కలిసి మైనర్ బాలిక ఇంటికి వెళ్లి మీతమ్ముడికి ఏదో జరిగిందని చెప్పి మైనర్ బాలుడు ఇంటికి తీసుకెళ్లారు. అక్కడు ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. వీరిపై ఫోక్సో, గ్యాంగ్ రేప్ సెక్షన్ల తో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# మధిరలో 'మీ సేవ' నిర్వాహకుని నిర్వాకం

**- ఓ ప్రైవేట్ ఆసుపత్రి పేరుతో ఫేక్ జనన నివేదికలు..?**

**ప్రజాపక్షం మధిర :** మధిరలోని మీ సేవా నిర్వాహకునిపై ప్రజల నుండి అనేక ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అక్రమ సంపాదనే ధ్యేయంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రి పేరుతో ఫేక్ జనన నివేదికలతో బర్త్ సర్టికెట్ల కోసం ఆన్‌లైన్ చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ఫేక్ జనన నివేదికలు తీసుకున్నట్లు సమాచారం. ఓ బర్త్ సర్టిఫికెట్ నిమిత్తం అధికారులు వెరిఫికేషన్‌కి వెళ్లగా జనన నివేదిక ఫేక్ అని తేలడంతో సంబంధిత మీసేవా నిర్వాహకున్ని అధికారులు మందలించినట్లు తెలిసింది. గతంలో కూడా ఈ మీసేవా నిర్వాహకుడిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. మీసేవా సెంటర్ శాంక్షన్ అయింది ఒక చోట నిర్వహించేది మరోక చోట అని, అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా నిర్వాహకుని తీరు మార్చుకోవటం లేదని అనేక విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న మీసేవా నిర్వాహకునిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# శాంతికి గోల్డ్ మెడల్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలోగల అమ్మపాలెం పంచాయతీ పరిదిలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగానికి చెందిన విద్యార్థిని ఎం శాంతి జెఎన్‌టియుహెచ్ గోల్డ్ మెడల్ సాధించింది. 202425 విద్యాసంవత్సరానికి గాను ప్రకటించిన గోల్డ్ మెడల్ జాబితాలో గోల్డ్ మెడల్ కు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉషాకిరణ్‌కుమార్ కళాశాల వైస్ చైర్మన్ మాట్లాడుతు ఆమె కృషి ఇతర విద్యార్థులకు ఆదర్శమని కొనిడాయాడారు. విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చిన్నయ్య, సిఎస్ఎం విభాగాధిపతి సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా, డీన్ డాక్టర్ డి శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్‌బాబా, వివిధ విభాగాధిపతులు శాంతిని అబినందించారు.

# రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్రం సంపూర్ణ (45) వివాహిత దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి... పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద బైక్ పై వెళుతున్న దంపతులను వెనక నుండి ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన గుర్రం సంపూర్ణ, గుర్రం వెంకట దాసుగా గుర్తించారు. గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రావికంపాడు గ్రామం నుండి జీనుగు మల్లి బైక్ పై వెళుతుండగా లంకపల్లి గ్రామం వద్ద వెనక నుండి లారీ ఢీకొట్టడంతో భార్య గుర్రం సంపూర్ణ లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగం, ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ శ్రీనివాస్, మసీద్ భాషా ఘటన స్థలికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. ఈ ఘటనపై కుమారుడు ఫిర్యాదుతో ఎస్సై కే వెంకటేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీని విఎం బంజర్ పోలీస్ స్టేషన్ తరలించారు.

# ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యం

**-సిపిఎం ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యం కావాలని ఇండస్ హాస్పిటల్ వైద్యులు రమేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మంచికంటి భవన్‌లో సిపిఎం ఖమ్మం టూటౌన్ కమిటీ బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెలనెలా ఉచిత మెడికల్ బిపి, షుగర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపుకు హాజరైన రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సంపాదన ధ్యాసలో పడి తన ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంగా ఉండడం వల్ల చిన్న వయస్సులోనే పెద్ద పెద్ద అనారోగ్య సమస్యల బారీన పడుతున్నారని ఆయన తెలిపారు. ఒక్కోసారి ఎన్ని డబ్బులు ఖర్చుపెట్టిన ప్రాణం దక్కదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని బిపి, షుగర్ తగ్గడానికి ఆయిల్ ఫుడ్, జింక్ ఫుడ్ తగ్గించాలన్నారు. ఆహారం కూడా బాగా నమిలి తినాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై. విక్రం తదితరులు ప్రసంగించగా ప్రముఖ వైద్యులు బారవి, జయశ్రీ, వరుణ్, రంజిత్, వెంకటరెడ్డి, వినిల్, దినేష్, అభినయ్ తదితరులు వైద్య సేవలను అందించారు.